## ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, అక్టోబర్ 1 : దేవరకొండలో మంగళవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు, ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా రావడంతో ప్రజల్లో ఉత్సాహం నెలకొందన్నారు. కేసీఆర్ మూడో సారి సీఎం కావాలని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో దేవరకొండ ఖిలాపై గులాబీ జెండా ఎగురడం ఖాయమని చెప్పారు. సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడం, సభ విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. అదో ఉత్సాహంతో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే నల్లగొండ ముందంజ

- రాష్ట్ర పౌరసఫరాల కమిషనర్ కె.శ్రీనివాస్


వివరాలు సేకరిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

నల్లగొండ రూరల్, నవంబర్ 1: వరి ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర పౌరసఫరాల కమిషనర్ కె. శ్రీనివాస్ అన్నారు. బుధవారం డీఎస్‌డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ కాళిందినితో కలిసి మండలంలోని చిన్నసూరారం, ఆర్జాలబావి సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆధ్వర్యంలో 175 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. 5899 మంది రైతుల ద్వారా 45,813 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, రూ.13.38 కోట్ల డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం బాగా పని చేసి సీఎంఆర్ డెలివరీలో, ధాన్యం కొనుగోళ్లలో జిల్లాను అగ్రస్థానంలో ఉంచారన్నారు. ఆయన వెంట అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం భవనాల పరిశీలన


వివరాలు సేకరిస్తున్న డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 1: మండలంలోని పెద్దగట్టు గ్రామపంచాయతీ పరిధిలోని బూడిదగట్టులో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అనువైన భవనాలను జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పెద్దగట్టు గ్రామంలో పోలింగ్ కేంద్రం లేక పోవడంతో 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బూడిదగట్టు గ్రామంలోని కేంద్రానికి వెళ్లి ఓటు వేయాల్సి వస్తున్నదని గ్రామస్తులు కలెక్టర్ ఆర్‌వి కర్ణన్ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో కలెక్టర్ ఆదేశానుసారం నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న తండాలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రైవేటు భవనాన్ని పరిశీలించామని, దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీరాములు, తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, సర్పంచ్ నరేందర్‌నాయక్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కొండమల్లేపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కొండమల్లేపల్లి, నవంబర్ 1 : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ ఆర్. శ్రీలక్ష్మి సూచించారు. బుధవారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మండంలోని చిన్నఅడిశర్లపల్లి, బాబ్లతండాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోస పోవద్దన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి తాలు లేకుండా చేసిన అనంతరం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు ధాన్యాన్ని తెచ్చేటప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ సిద్దపంగ వెంకన్న, ఏఈఓలు సురేశ్, అనంతలక్ష్మి, సైదులు, సీఈఓ పల్లా తిరుపతిరెడ్డి, పాపిరెడ్డి, నరేశ్, లక్ష్మణ్, హరి, మధునాయక్, రైతులు పాల్గొన్నారు.

# మూడో కాన్వకేషన్‌కు ఎంజీయూ సిద్ధం

- ఈ నెల 8న నిర్వహించేందుకు నిర్ణయం
- ఎంజీయూ వెబ్‌సైట్‌లో టాపర్స్ లిస్ట్
- ఉమ్మడి జిల్లాలోని 40 మందికి బంగారు పతకాలు, 17 మందికి పీహెచ్‌డీలు



ఎంజీ యూనివర్సిటీ

రామగిరి, నవంబర్ 1: నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ తృతీయ కాన్వకేషన్(స్నాతకోత్సవం)కు అధికారులు తేదీ ఖరారు చేశారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి సూచన మేరకు ఈ నెల 8న కాన్వకేషన్ నిర్వహణకు వర్సిటీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, టాపర్స్‌కు బంగారు పతకాలను అందించనున్నారు.

మహాత్మాగాంధీ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ (ఓడీ) అందించేందుకు తృతీయ కాన్వకేషన్ నిర్వహించాలని వర్సిటీ వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు నిర్ణయించారు. ఆ దిశగా వర్సిటీ పరీక్ష విభాగం అధికారులు కాన్వకేషన్‌కు అవసరమైన అంతర్గత పనులు పూర్తి చేస్తున్నారు. ఈ నెల 8న ఎంజీయూ ప్రధాన క్యాంపస్‌లో కాన్వకేషన్(స్నాతకోత్సవం) నిర్వహించి పట్టాలు అందించనున్నారు. యూనివర్సిటీ స్థాయిలో వివిధ కోర్సుల్లో టాపర్స్‌గా నిలిచిన 40 మందికి బంగారు పతకాలు, పీహెచ్‌డీ పూర్తి చేసిన 17 మందికి డాక్టరేట్‌లు అందించనున్నారు.

### ఎంజీయూ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

యూనివర్సిటీ నిర్వహించే తృతీయ స్నాతకోత్సవానికి సంబంధించి బంగారు పతకాలు అందుకునే విద్యార్థుల వివరాలతోపాటు, వివిధ కోర్సుల్లో 2018-19 నుంచి 2020-21 విద్యా సంవత్సరం వరకు ఉమ్మడి జిల్లాలో వివిధ కాలేజీల్లో చదివి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచి మెరిట్ సర్టిఫికెట్లు అందుకునే 40 మందికి బంగారు పతాకలు, 2023 అక్టోబర్ వరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన 17 మందికి పట్టాలు అందుకునే వారి జాబితాను ఎంజీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వీరికి గవర్నర్ చేతులమీదుగా పట్టాలు అందించనున్నారు.

### హాజరుకానున్న గవర్నర్

ఎంజీయూలో ఈనెల 8 జరిగే తృతీయ కాన్వకేషన్‌కు ఛాన్స్‌లర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ తామిళిసై సౌందర్యరాజన్ హాజరవుతారు. ముఖ్యవక్తగా ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్. రామచంద్రం, ఎంజీయూ వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి పాల్గొననున్నారు.

### కాన్వకేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశాం



ఎంజీయూ వీసీ తృతీయ కాన్వకేషన్ నిర్వహించి విద్యార్థులకు పట్టాలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 8న ఎంజీయూ ప్రధాన క్యాంపస్‌లో కాన్వకేషన్ నిర్వహించనున్నాం. 2018 నుంచి 2021వరకు యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, 2023 అక్టోబర్ వరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి డాక్టరేట్ పట్టాలను గవర్నర్ చేతులమీదుగా అందిస్తాం.

-ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఎంజీయూ వీసీ

## జయహో.. కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. అదే స్ఫూర్తితో 26న మునుగోడులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు జనం భారీగా తరలివచ్చారు. ఉప ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. మునుగోడు అభివృద్ధిపై తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇక 29న కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. విద్యావేత్త, బీసీ బిడ్డ మల్లయ్యయాదవ్‌ను గెలిపించుకొని 50-60శాతం ఉన్న బీసీలంతా తమ సత్తా చాటాలని కేసీఆర్ ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇక అదే రోజు తిరుమలగిరిలో జరిగిన తుంగతుర్తి సమరశంఖారావం సభలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు మద్దతుగా కేసీఆర్ మాట్లాడారు. పట్టుదల కలిగిన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రజలు తీసుకుంటే నియోజకవర్గం మొత్తానికి దళితబంధు ఇచ్చే బాధ్యత నాది అని కేసీఆర్ ప్రకటించడం విశేషం. తర్వాత ఆలేరులో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. 'సునీతా నా సొంత బిడ్డ. సొంత బిడ్డ కోరిన కోరికలు తీర్చే బాధ్యత తండ్రిగా నాదే. సునీతను యాదాద్రి శిఖరమంత ఎత్తు ఓట్లతో గెలిపించండి.. ఆలేరును తీర్చిదిద్దే బాధ్యత నాదే' అని స్పష్టం చేశారు. మంగళవారం సాగర్ ఆయకట్టు పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావుకు మద్దతుగా ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. భువనగిరి నుంచి ఆసిఫ్‌నెహర్ కాల్వ ద్వారా గోదావరి జలాలను పానగల్ ఉదయ సముద్రంలోకి తీసుకొచ్చి అక్కడి నుంచి పెద్దదేవుల పల్లి రిజర్వాయర్‌లోకి తరలించే స్కీం రెడీగా ఉందని చెప్పారు. ఇది కావాలంటే బీఆర్ఎస్‌ను మరొక సారి గెలిపించాలని.. బీఆర్ఎస్‌తోనే సాగర్ ఆయకట్టులో నీళ్ల బాధకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అదేరోజు సాయంత్రం దేవరకొండలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సభకు సామాన్య ప్రజలతో పాటు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. త్వరలోనే డిండి ఎత్తిపోతలను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు దారిద్ర్యాన్ని పారదోలుతానని కేసీఆర్ ప్రకటించగా చప్పట్లు మార్మోగాయి. 'రవీంద్రకుమార్ మంచి ఎమ్మెల్యే... ఇదే పద్ధతిలో 70-80వేల మెజారిటీతో ఆయన్ను గెలిపించాలి' అని కేసీఆర్ పిలుపునివ్వగా చేతులెత్తి జనం సమ్మతించారు. ఇలా అన్ని సభల్లోనూ కేసీఆర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇక నామినేషన్ల ప్రక్రియ అనంతరం మిగిలిన సూర్యాపేట, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్ నియోజకవర్గాల సభల్లో కేసీఆర్ పాల్గొననున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 1 : మండలంలోని ఘనపురం, పీఏపల్లి, అంగడిపేటతో పాటు గుడిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ అజ్మీరా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

### పెద్దవూరలో..


పెద్దవూర: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పెద్దవూర, నవంబర్1: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ సుజాత, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి తేమ శాతం 17 ఉండేలా చూసుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సీఏసీఎస్ సీఈఓ వి. వెంకట్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ శ్రీదేవి, ఏపీఎం విజయ్‌కుమర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకేబీఆర్‌లో చేప పిల్లల విడుదల


చేపపిల్లలను వదులుతున్న ఎఫ్‌డీఓ

పెద్దఅడిశర్లపల్లి, నవంబర్ 1 : ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన చేప పిల్లలను ఎఫ్‌డీఓ మారయ్య బుధవారం వదిలారు. ప్రాజెక్టులో మొత్తం 15 లక్షల చేప పిల్లలు, ఆరులక్షల రొయ్యలు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, మాజీ చైర్మన్ మల్లయ్య, పాల్గొన్నారు.